క్లుప్తంగా

ఉత్సవ కమిటీ నియామకం


అర్రూరి నర్సింహ చైర్మన్

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామంలో గల శ్రీ శంభులింగేశ్వర స్వామి ఆలయ శివరాత్రి ఉత్సవాల కమిటీని నియమిస్తూ దేవాదాయ, ధర్మదాయ శాఖ అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ చైర్మన్‌గా అర్రూరి నర్సింహ, డైరెక్టర్లుగా జంజిరాల మల్లయ్య, కొరగాని చంద్రకళ, సుర్కంటి పద్మారెడ్డి, దొండ యాదయ్యలు నియామకయ్యారు.

జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపిక


నియామక పత్రం అందుకుంటున్న కిరణ్

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన గుండెపూరి కిరణ్‌కుమార్ ఇటీవల విడుదలైన గురుకుల ఉద్యోగ పరీక్ష ఫలితాల్లో తెలుగు జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సంస్థ అధికారి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకున్నారు. లెక్చరర్ ఉద్యోగాన్ని సాధించిన కిరణ్‌కుమార్‌ను పలువురు గ్రామస్తులు, స్నేహితులు అభినందించారు.

సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం

నకిరేకల్: డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని హర్షిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి సోమవారం నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బొడ్డు నాగరాజు, యానాల శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్ మాజీద్, వంటిపాక వెంకన్న, గాదరి అంజయ్య, గోగికార పరమేష్, బొడ్డు రాజశేఖర్, తలారి గోపి, భరత్, మొర్సు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి


నివాళులర్పిస్తున్న క్లబ్ సభ్యులు

నల్లగొండ టౌన్: జాతీయ భద్రత దినోత్సవం సందర్భంగా సోమవారం లయన్స్ క్లబ్ శక్తి న్యూ వాయిస్ ఆధ్వర్యంలో క్లాక్ టవర్ సెంటర్‌లో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఝాన్సీరాణి మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం ప్రాణాలను పణంగా పెట్టే సైనికులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రెటరీ విమల, ట్రెజరర్ సరిత, మాధవి సుజాత పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

నకిరేకల్: పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో సోమవారం హైదరాబాద్‌లోని వనస్థలిపురం మహాలక్ష్మీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 18 మంది రిటైర్డు ఉద్యోగులకు కంటి పరీక్షలు చేశారు. వీరిలో ముగ్గురికి కంటి ఆపరేషన్లు చేయాలని ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పసల మరియదాస్, కార్యదర్శి సోమయ్య, ప్రచార కార్యదర్శి శివకోటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు అందజేత

చిట్యాల: మండలంలోని చిన్నకాపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆసరా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ సోమవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు ఇతర పరీక్ష సామగ్రి అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సైదానాయక్, ఉపాధ్యాయులు బాలయ్య, నయీముద్దీన్, అష్రఫ్ అలీ, జ్యోతి, జానకిరాములు, నవనీత, శ్రీలత, సంస్థ సభ్యులు ఎల్లాచారి, లింగస్వామి, అర్జున్, రాజు లెనిన్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు

నల్లగొండరూరల్: టీడీపీ నాయకుడు గుండు వెంకటేశ్వర్లు 51వ పుట్టిన రోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బీసీ, ప్రజా సంఘాల నాయకులు కేక్ కట్ చేసి వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. పేదలకు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, గోపాల్, వెంకటయ్య, రవి, సత్తయ్య పాల్గొన్నారు.



తప్పు చేసిన వారిని వదిలేది లేదు


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి


సమావేశంలో పాల్గొన్న పాలకవర్గ సభ్యులు

- అనుమతులు లేకుండానే పనులు చేశారు
- హరితహారం మొక్కలకు గతంలో రూ.18 కోట్లు ఖర్చు చూపించారు
- విజిలెన్స్ లేదా ప్రభుత్వ సంస్థతో విచారణ చేయిస్తాం
- కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: నీలగిరి పట్టణంలో అభివృద్ధి పేరుతో అవకతవకలకు పాల్పడ్డారని, గత ప్రభుత్వ హయాంలో తప్పు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం కౌన్సిల్ సమావేశం చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గ్రీన్ బడ్జెట్ పేరుతో హరితహారం మొక్కలకు రూ.18 కోట్లు ఖర్చు చేసినట్లు చూపించారని, ఇష్టానుసారంగా కొన్నింటి అంచనాలు పెంచుకుంటూ పోయి అవినీతికి పాల్పడ్డారని అన్నారు. కౌన్సిలర్ ఖయ్యూంబేగ్ మాట్లాడుతూ గతంలో అభివృద్ధి మాటున అక్రమాలకు పాల్పడ్డారని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ నిధులను కౌన్సిల్ అనుమతి లేకుండానే ఇతర పనులకు దారి మళ్లించారని, పూర్తిస్థాయి విచారణ జరిపించి సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గత పాలనలో సిద్దిపేట, సిరిసిల్ల వాళ్లు వచ్చి నల్లగొండ మున్సిపాలిటీని కొల్లగొట్టారని ఆరోపించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ మాట్లాడుతూ గతంలో శ్మశానవాటికలు, పార్కుల అభివృద్ధి పేరుతో నిధులను దారి మళ్లించారన్నారు. రూ.56 కోట్లు పట్టణ ప్రగతి నిధులు, రూ.36 కోట్ల టీఎస్ బీపాస్, రూ.17 కోట్ల ఎల్‌ఆర్‌ఎస్ నిధులతో వార్డుల్లో అభివృద్ధి చేయకుండా ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. వీటన్నింటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, ఎడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు లేక అంత్యక్రియల సమయంలో మహిళలు దుస్తులు మార్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తగిన వసతులు కల్పించాలని కోరారు. బీజేపీ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ మాట్లాడుతూ గతంలో కౌన్సిల్ అనుమతి లేకుండానే పనులు చేపట్టారని, ప్రతి పని కౌన్సిల్ ద్వారానే చేపట్టాలని డిమాండ్ చేశారు. తాగు నీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కౌన్సిలర్లు లేవనెత్తిన పలు అంశాలపై చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. 2014 నుంచి కొంతమంది అధికారులు అక్రమాలకు పాల్పడారని, కొన్ని ఫైళ్లను తగులబెట్టి పలువురు ఉద్యోగులు సస్పెండ్ అయ్యారని అన్నారు. ఎల్‌ఆర్, పట్టణ ప్రగతి నిధులను దుర్వినియోగం చేశారన్నారు. చర్లపల్లి పార్కులో రూ.4.85 కోట్లు ఖర్చు చేసినా ఒక్క మనిషి వెళ్లడంలేదన్నారు. రూ.4 కోట్ల సమీకృత మార్కెట్ పనులను రూ.8.75 కోట్లకు పెంచారని, గ్రానైట్ బండలు వేసి నిధులు వృథా చేశారని అన్నారు. అవకతవకలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ హరిచందన దృష్టికి తీసుకువెళ్లి విజిలెన్స్ లేదా ఇతర ప్రభుత్వ సంస్థ ద్వారా విచారణ చేయించి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇక నుంచి చిన్న తప్పు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఈఈ రాములు, ఏసీపీ నాగిరెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు


కేతేపల్లి ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ రామారావునాయక్

కేతేపల్లి: పంటల సాగులో రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడుగులు సాధించవచ్చని నకిరేకల్ వ్యవసాయశాఖ ఏడీఏ రామారావు నాయక్ అన్నారు. కేతేపల్లి మండలంలోని గుడివాడ గ్రామంలో యాసంగిలో రైతులు సాగు చేసిన వరి పొలాలను సోమవారం ఆయన పలువురు రైతులతో కలిసి పరిశీలించారు. వరి పొలాలకు ప్రస్తుతం సోకిన తెగుళ్లు, దాని నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం కేతేపల్లిలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు పరిశీలించారు. ఈ–పాస్ యంత్రం ద్వారా ఎరువులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు. నిషేధిత పురుగు మందులు అమ్మితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏడీఏ వెంట కేతేపల్లి ఏఓ బి.పురుషోత్తం, ఎంఈఓ వీరేష్, రైతులు సతీష్, సైదులు ఉన్నారు.

పరీక్షలంటే విద్యార్థులు ఆందోళన చెందవద్దు


విద్యార్థులకు సూచనలిస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ స్వామి

నార్కట్‌పల్లి: పరీక్షలంటే విద్యార్థులు ఆందోళన చెందకుండా ఒత్తిడిని జయిస్తూ ప్రశాంతంగా పరీక్షలు రాసేలా మానసికంగా సిద్ధం కావాలని ఏఎస్‌డబ్ల్యూఓ డి.స్వామి అన్నారు. మండలంలోని బ్రాహ్మణ వెల్లంల గ్రామంలో గల ఎస్సీ బాలికల వసతి గృహంలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని వసతి గృహాన్ని పూర్తిగా పరిశీలించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ప్రశ్నలను ప్రశాంతంగా చదివి వాటిని అర్థం చేసుకుని జవాబులు రాయాలని విద్యార్థులకు సూచించారు. పూర్తి ఏకాగ్రత చదువుపై పెట్టాలన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలంటే పదో తరగతి మొదటి పునాదిరాయి అని వివరించారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ సౌజన్య, ప్రధానోధ్యాయుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి


కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న ప్రభావతి

నల్లగొండ: పొదుపు సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని కోరుతూ ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి సోమవారం కలెక్టర్ హరిచందనకు వినతి పత్రం అందజేశారు. మహిళా సంఘాల సభ్యులకు నేటికీ పావలా వడ్డీ రుణాలు అందడం లేదని, బ్యాంక్‌లు అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని కలెక్టర్‌కు విన్నవించారు. స్త్రీ నిధి డబ్బులు దుర్వినియోగం అవుతున్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండ అనురాధ, జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, జిల్లా సహాయ కార్యదర్శులు చనగాని నాగమణి, భూతం అరుణకుమారి పాదూరి గోవర్ధన, కారంపాడి ధనలక్ష్మి, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అద్దె కార్ల బకాయిలు విడుదల చేయాలని వినతి

నల్లగొండ టూటౌన్: ఐసీడీఎస్, సీడీపీఓ, డీడబ్ల్యూఓ కార్యాలయాల్లో నడుస్తున్న అద్దె కార్ల (హైర్ వెహికిల్స్) బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ అద్దె కార్ల యజమానులు సోమవారం కలెక్టర్ హరిచందనకు వినతి పత్రం అందజేశారు. 10–12 నెలల అద్దె చెల్లించకపోవడంతో తమకు కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని వివరించారు. అదేవిధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా నెలవారీ అద్దె రూ.33 వేల నుంచి రూ.55 వేలకు పెంచాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో శోభన్, రామకృష్ణ, సత్తయ్య, శంకర్, నాజిద్, సంతోష్, వెంకటయ్య ఉన్నారు.

మారనున్న మునుగోడు రూపురేఖలు

- పట్టణంలో రోడ్ల విస్తరణకు రూ.24కోట్లు మంజూరు
- త్వరలో ప్రారంభంకానున్న పనులు


నాలుగు లేన్లుగా మారనున్న మునుగోడు ప్రధాన కూడలిలోని రోడ్డు

మునుగోడు: మునుగోడు పట్టణ రూపురేఖలు మారనున్నాయి. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన విజ్ఞప్తి మేరకు పట్టణంలోని ప్రధాన రహదారులైన నల్లగొండ–చౌటుప్పల్ రోడ్డుతో పాటు మునుగోడు–చండూరు రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించడంతో పాటు మధ్యలో గార్డెన్‌తో కూడిన డివైడర్, రోడ్డుకు ఇరువైపులా మురుగు కాల్వలు వాటిపై ఫుట్‌పాత్ నిర్మాణానికి ఎండీఆర్(మేజర్ డిస్టిక్ రోడ్డు ప్లాన్) నిధుల నుంచి రూ.24కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసింది. ఈ నిధులతో నల్లగొండ–చౌటుప్పల్ రోడ్డులో వాగు వంతెన నుంచి ఎంపీడీఓ కార్యాలయ శివారు వరకు 2.4 కిలోమీటర్లు, మునుగోడు ప్రధాన కూడలి నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు 1.5 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. త్వరలో పనులు ప్రారంభించేందుకు టెండర్లు కూడా పిలిచినట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. మునుగోడు పట్టణానికి మహర్దశ పట్టనుండడంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టెండర్లు పిలిచాం..

మునుగోడు పట్టణంలోని ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా విస్తరించేందుకు రూ.24కోట్లు మంజూరయ్యాయి. పనులు చేపట్టేందుకు గాను టెండర్లు కూడా పిలిచాం. టెండర్ల ప్రక్రియ ముగిసిన వెంటనే రోడ్డు పనులు ప్రారంభిస్తాం.

– శిరీష్, ఆర్‌అండ్‌బీ ఏఈ

సంతోషంగా ఉంది



స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కృషితో మునుగోడు పట్టణంలో రోడ్లు మారుతుండడం సంతోషంగా ఉంది. రోడ్ల విస్తరణకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– బీసం విజయ్, మునుగోడు

రజాకార్ చిత్ర దర్శకుడికి సన్మానం


సత్యనారాయణను సన్మానిస్తున్న స్నేహితులు

చిట్యాల: పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ 1991–92 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థి, 'రజాకార్' చిత్ర దర్శకుడు యాట సత్యనారాయణను సోమవారం హైదరాబాద్‌లో ఆ బ్యాచ్ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం నేపథ్యంలో రూపొందించిన 'రజాకార్' చిత్రం ఘన విజయం సాధించాలని, తెలంగాణ వాదులంతా చిత్రాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ బ్యాచ్ విద్యార్థులు పోలిశెట్టి రాజు, దౌలతాబాద్ వాసుదేవ శర్మ, జడల చినమల్లయ్య, జెల్లా రమేష్, ప్రవీణ, లత, శ్రీదేవి, శోభ, విజయసారథి, రాధ, లక్ష్మీ, మల్లేష్, రామకృష్ణ, జంగయ్య, రమేష్, అమరేందర్ రెడ్డి, సారథి, కృష్ణ, వెంకటేష్, ఆనంద్, వెంకన్న పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మునుకుంట్ల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

కట్టంగూర్: మండలంలోని మునుకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సరదాగా గడిపారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు చదువు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులకు శాలువా కప్పి మెమెంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్, మల్లయ్య, హనుమంతు, వెంకట్‌రెడ్డి, చారి, శ్రీనివాస్, ఉస్సేన్, విద్యార్థులు పున్నంరాజు సుధాకర్, ఎం.శంకర్, ఎస్.సైదులు, ఎం.సతీష్, సంతోష్, ఆంజనేయులు, లింగయ్య, శంకరయ్య, మల్లేష్, ఐలయ్య, ప్రభాకర్, శ్రీవిద్య, ఇందిర, రేణుక, సంధ్య, సువర్ణ ఉన్నారు.

ధ్యానం, యోగాతో మానసిక ఒత్తిడి దూరం

శాలిగౌరారం: యోగా, ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని యోగా శిక్షకుడు తిరుమలశెట్టి సుబ్బారావుగురూజీ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ధ్యానం, యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజలకు ధ్యానం, యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మనిషికి మానసిక, శారీరక ప్రశాంత ఎంతో అవసరమన్నారు. యోగాతో మానసిక, శారీరక ప్రశాంత కలుగుతుందని, ప్రాథమికంగా 12 రోజుల పాటూ జరిగే ధ్యానం, యోగా శిక్షణతో ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


అక్కలాయిగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

కట్టంగూర్ : మండలంలోని అక్కలాయిగూడెం ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాజకీయ నాయకులుగా, ఉపాధ్యాయులుగా, వివిధ శాఖల అధికారులుగా బాధ్యతలు నిర్వహించి అలరించారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి పాఠశాల హెచ్‌ఎం నిమ్మనగోటి వెంకటరమణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీరెడ్డి ఝాన్సీరెడ్డి, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ గోవర్ధన్, కవిత పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ వెంటనే చేయాలి

శాలిగౌరారం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం మండల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ కార్మికుల కుటుంబాలకు సంవత్సరానికి రూ.15 వేలు ఇచ్చి ఆదుకుంటామన్న హామీని కూడా వెంటనే అమలు చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సిరుపంగి ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, చలకాని మల్లయ్య, మండల కార్యదర్శి మక్క బుచ్చిరాములు, సిరుపంగి రాములు, కల్లూరి లింగయ్య, దాసరి దేవచిత్తం, యాదయ్య, శ్రీనివాస్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

మునుగోడు: ఉపాధిహామీ పథకం నుంచి మంజూరైన రూ.30 లక్షల నిధులతో మునుగోడు మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో సీసీ రోడ్ల పనులను సోమవారం కాంగ్రెస్ పార్టీ మునుగోడు పట్టణ అధ్యక్షుడు సాగర్ల లింగస్వామి ప్రారంభించారు. పాల్వాయి జితేందర్‌రెడ్డి, ఎండీ అన్వర్, జిట్టగోని యాదగిరి, పందుల నర్సింహ, పందుల భాస్కర్, ఆరేళ్ల సైదులు, గోపాల్, గేగ్రోరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీపీ నరేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి: గ్రామాల్లో వేసవి కాలంలో నీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందు జాగ్రత్తగా నీటి సమస్యలు వచ్చే గ్రామాలను గుర్తించాలని సూచించారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఉమేష్, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓ సుధాకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం


జీరో విద్యుత్ బిల్లులు అందిస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సమరంరెడ్డి

శాలిగౌరారం: రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమమే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీల అమలులో భాగంగా మండలంలోని ఆకారం గ్రామంలో సోమవారం గృహజ్యోతి పథకంలో లబ్ధిదారులకు జీరో విద్యుత్ బిల్లు రశీదులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ నిర్ణీత కాలంలో అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయితగోని సైదులు, జవాజి నాగరాజు, వలిశెట్టి సైదులు, గోదాసు మల్లయ్య, ఇంద్రకంటి శైలజ, నాగరాజు, మల్లయ్య, మధు, వెంకన్న, శ్రీరాములు, ముత్తయ్య, రాములు, సారయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ


శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

రామగిరి (నల్లగొండ): నల్లగొండ పట్టణంలో క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ నాయకులు మాట్లాడుతూ దేశంలో పలుచోట్ల క్రైస్తవులపై దాడులను ఖండిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ర్యాలీలో రేఖల భద్రాద్రి, దుబ్బ అశోక్ సుందర్, మేడి లక్ష్మయ్య, దున్న ప్రేమ్, దుబ్బ ప్రేమ్‌కుమార్, రొయ్య కిరణ్, టి.ప్రవీణ్, దుబ్బ ప్రదీప్, పాస్టర్లు మోసెస్, క్రిస్టఫర్, సమర్పన్ కుమార్, డాక్టర్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ బాధితురాలికి సరుకులు అందజేత


సరుకులు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

మునుగోడు: మండలంలోని గొంగోరిగూడెం గ్రామానికి చెందిన ఫ్లోరోసిస్ బాధితురాలు ఎల్లమ్మకు రఘు అరికపూడి సేవా ట్రస్టు సభ్యులు నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు ఉచితంగా అందజేశారు. అంతేకాకుండా ఆమె ఖర్చుల నిమిత్తం ప్రతినెలా రూ.3వేల చొప్పున అందజేస్తామని టస్టు సభ్యులు తెలిపారు. 100 శాతం వైకల్యంతో మంచానికే పరిమితమైన ఎల్లమ్మకు ప్రభుత్వం ఆసరా పెన్షన్ ఇవ్వకపోవడం విచారకరమని సంస్థ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మహేష్, ఎల్లయ్య , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'అర్చక ఉద్యోగులందరికీ హెల్త్ ఇన్సూరెన్స్'

కనగల్: రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న 2,500 మంది అర్చక ఉద్యోగులందరికీ హెల్త్ ఇన్సూరెన్స్, హౌసింగ్ రుణాలు, ఇతర సదుపాయాలను కల్పించేందుకు వెల్ఫేర్ బోర్డులో ఏకగ్రీవంగా తీర్మానం చేశారని సంక్షేమ బోర్డు సభ్యుడు, దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయ ముఖ్య అర్చకులు చిలకమర్రి శ్రవణ్ కుమారాచార్యులు తెలిపారు. సోమవారం ఆయన స్థానికంగా విలేరులతో మాట్లాడారు. వెల్ఫేర్ బోర్డు చైర్మన్ నవీన్ మిట్టల్ అధ్యక్షతన సోమవారం హైదరాబాదులో ప్రత్యేక సమావేశం నిర్వహించారన్నారు. అర్చక ఉద్యోగుల సంక్షేమానికి బోర్డు తీర్మానాలు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి మోత్కూరుకు బస్ సర్వీసు

శాలిగౌరారం: నకిరేకల్ మీదుగా మోత్కూరు వరకు మంగళవారం నుంచి బస్ సర్వీసును పునరుద్ధరించనున్నట్లు నల్లగొండ ఆర్టీసీ డిపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నకిరేకల్ నుంచి ఉదయం 9 గంటలకు, తిరిగి మధ్యాహ్నం ఒంటిగంటకు బస్సు మోత్కూరుకు బయలుదేరుతుందన్నారు. నకిరేకల్ వయా శాలిగౌరారం, భైరవునిబండ, అమ్మనబోలు మీదుగా మోత్కూరుకు వెళ్తుందని తెలిపారు.